క్లుప్తంగా

జొన్నల కొనుగోలు కేంద్రం పరిశీలన

నారాయణఖేడ్: మనూరు మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలులను మూడు రోజులకు పెంచడంతో ఇప్పటివరకు టోకెన్లు పొందిన రైతుల ధాన్యంను వెను వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్ వెంకటస్వామి, ఆర్‌ఐ శంకర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏఈవో సంగమేశ్, ఖాజా సమీర్, డీసీఎంఎస్ సూపర్‌వైజర్ స్వప్న ఉన్నారు.

ఖైదీలకు న్యాయ సేవలు అందించాలి



జైలును సందర్శిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర

సంగారెడ్డి టౌన్: జైలులోని ఖైదీలకు ఉచిత న్యాయసేవలు అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర అన్నారు. కంది‌లోని సెంట్రల్ జైలును శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె జైలు అధికారులతో మాట్లాడుతూ ఖైదీలకు భోజనం, గదులు, పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, వారికి కావాల్సిన అవసరాలు, సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఖైదీల గదులు, పరిసరాలను పరిశీలించారు. బెయిల్స్, ములాఖాత్ తొందరగా అంతేలా చూడాలని జైల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్, జిల్లా జైలు సూపరింటిండెంట్ భరత్, జడ్జిలు, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రావి ఆకుపై తెలంగాణ పోరాట పటిమ



అమరవీరుల త్యాగం, పోరాట స్ఫూర్తిని తెలిపే చిత్రం

నారాయణఖేడ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నారాయణఖేడ్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకులపై పలు చిత్రాలను మలిచారు. ఉద్యమకారులు, మేధావులు, జర్నలిస్టులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, కవులు, కళాకారులు, సబ్బండ వర్గాల పోరాటం, తెలంగాణ అమర వీరుల త్యాగాన్ని చిత్రీకరించారు. తెలంగాణతల్లి, ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రాజముద్ర లోగోను రావి ఆకుపై చిత్రీకరించారు.

మొక్కలను సిద్ధంగా ఉంచండి



డంప్‌యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

రాయికోడ్(అందోల్): పదో విడత హరితహారంలో భాగంగా లక్ష్యం మేరకు మొక్కలను సిద్ధంగా ఉంచాలని డీఎల్‌పీఓ అమృత అన్నారు. మండల పరిధిలోని కుసునూర్ గ్రామంలోని నర్సరీతో పాటు వైకుంఠధామం, క్రీడాప్రాంగణం, డంప్ యార్డులను ఎంపీఓ అంజనిదేవితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెలలో విరివిగా మొక్కలను నాటేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగు నీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

మంగల్‌పేట్ నుంచే బస్సుల రాకపోకలు

నారాయణఖేడ్: ప్రజల కోరికమేరకు ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్ బస్టాండ్ నుంచే బస్సుల రాకపోకలు జరుగుతాయని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇంతవరకు పట్టణంలోని రాజీవ్‌చౌక్ నుంచి బస్సుల రాకపోకలు కొనసాగేవని, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయాలు లేక ప్రయాణికులు ఇబ్బంది పడేవారని తెలిపారు. మంగల్‌పేట్ బస్టాండ్‌లో అన్ని సదుపాయాలు ఉన్నందున ఇక్కడి నుంచే బస్సుల రాకపోకలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- కలెక్టర్ క్రాంతి
- ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం

వట్‌పల్లి(అందోల్): నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ క్రాంతి హెచ్చరించారు. వట్‌పల్లి మండల పరిధిలోని ఖాదిరాబాద్‌లో ఎరువుల దుకాణాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నాణ్యమైన ఎరువులు, విత్తనాలను పంపిణీ చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగానే ఆకస్మికంగా తనిఖీ చేపడుతున్నామని వివరించారు. వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించి రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో లూజుగా విక్రయించరాదన్నారు. అనంతరం గ్రామంలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట అందోల్ ఆర్డీఓ పాండు, తహసీల్దారు శ్రీనివాస్, ఏఓ మహేష్ చౌహన్, ఏఈఓ పరిమళ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలను అందించాలి

జిన్నారం(పటాన్‌చెరు): రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని గుమ్మడిదల తహశీల్దార్ గంగాభవాని డీలర్లకు సూచించారు. గుమ్మడిదల, కానుకుంట గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో విక్రయిస్తున్న విత్తనాలతో పాటు రికార్డులను పరిశీలించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

ఝరాసంగం(జహీరాబాద్): విత్తనాలు ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని తహసీల్దార్ సంజీవరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్ హెచ్చరించారు. ఝరాసంగంలోని ఫర్టిలైజర్ దుకాణాలను పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లోని రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా దుకాణ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.



వట్‌పల్లి: విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

ఖేడ్‌లో ఫెర్టిలైజర్ దుకాణం తనిఖీ

నారాయణఖేడ్: నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి హెచ్చరించారు. స్థానిక సీఐ శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శంకర్‌లతో డివిజన్ టాస్క్‌ఫోర్స్ టీంగా ఏర్పడి ఖేడ్ పట్టణంలోని అన్నదాత ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణంలో నిల్వ ఉన్న విత్తనాలు, రికార్డులను, స్టాకు వివరాలను పరిశీలించారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కంగ్టి(నారాయణఖేడ్): విత్తనాలు అమ్మకంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు తప్పవని తహశీల్దార్ విష్ణుసాగర్ అన్నారు. మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖ, పోలీసు అధికారులతో కలిసి విత్తనాలు, రికార్డులను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి అవుసుల ప్రవీణ్‌చారి, ఏఎస్‌ఐ నారాయణ పాల్గొన్నారు.

మనూరు మండల కేంద్రంలో...

నారాయణఖేడ్: మనూరులోని శ్రీజగదాంబ ట్రేడర్స్ ఫెర్టిలైజర్ దుఖాణాన్ని మండల స్థాయి స్వాడ్ టీం సభ్యులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ అంబ్ర్యా, ఆర్‌ఐ శంకర్‌రెడ్డిలు టీంగా ఏర్పడి తనిఖీ నిర్వహించారు. ఫెర్టిలైజర్‌లో నిల్వ ఉన్న విత్తనాలు, స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య : కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి: సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని కలెక్టర్ క్రాంతి అన్నారు. అందోల్ నియోజకవర్గం.. చౌటకూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, సరఫ్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చేపట్టనున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. విద్యార్థులను ప్రైవేట్ పాఠశాల పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించడం వల్ల ఆర్థికభారం తప్పుతుందని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా చేపట్టిన మరమ్మతు పనులను పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, తహసీల్దార్ ఈశ్వరిరాణి, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సుల్తాన్‌పూర్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

మిషన్ భగీరథ నీరు పరిశీలన



నీటి శాంపిల్‌ను పరీక్షిస్తున్న జలమండలి అధికారులు

సాక్షి ఎఫెక్ట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఐజీ కాలనీలో మిషన్ భగీరథ నీటిలో పాకురు రావడంతో గత నెల 31వ తేదీన సాక్షి దినపత్రికలో 'ఈ నీరు తాగేదెట్ల?' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు శనివారం స్పందించారు. జలమండలి అధికారి జనార్దన్ హెచ్ఐజీ కాలనీలోని రిటైర్డ్ బెల్ అధికారి ధర్మప్రకాష్ ఇంటి వద్దకు వచ్చి మిషన్ భగీరథ నీటి శాంపిల్‌ను సేకరించి పరీక్షించారు. అనంతరం జలమండలి అధికారి జనార్దన్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పైపునకు ప్లాస్టిక్ పైపు అమర్చి నీళ్ల పట్టడం ద్వారా పైపులోని నీళ్ల వల్ల పాకురు పట్టి వచ్చిందని వివరించారు. ప్లాస్టిక్ పైపు ఎండలో ఉంచడం వలన పైపులో పాకురు వస్తుందన్నారు. మిషన్ భగీరథ నీరు స్వచ్ఛతగా ఉన్నాయని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఎవరైన మిషన్ భగీరథ పైపులకు ప్లాస్టిక్ పైపులు అమర్చి నీళ్ల పట్టుకుంటే ఆ పైపులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్

సంగారెడ్డి టౌన్: ప్రైవేట్ స్కూల్స్, కార్పొరేట్ కాలేజీల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం భూపాల్ మాట్లాడుతూ ప్రతి ఏడాది కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా ఫీజులు పెంచుకుంటూ పోతున్నాయన్నారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోధనాభ్యసన విషయాల్లో విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాల వల్ల టీచర్లు స్వేచ్ఛగా చదువు చెప్పలేకపోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్, మల్లేశం, రాజయ్య, సాయిలు, నాయకులు ప్రవీణ్, యాదగిరి, నర్సింలు, విద్యాసాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపాల్

ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

జహీరాబాద్ టౌన్: ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలో చేపట్టిన పనులపై ఎంపీపీ సమావేశ మందిరంలో శనివారం సామాజిక తనఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 24 వరకు చేపట్టిన పనులపై సామాజిక తనఖీ బృందం మే 17 నుంచి 31 వరకు 22 గ్రామ పంచాయతీలతో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజావేదికలో తనిఖీ బృందం వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఆడిట్‌లో వచ్చిన వాటిని చదివి వినిపించారు. మండలంలో గత సంవత్సరం రూ.5,64 కోట్ల పనులు జరినట్లు వారి నివేదిక అందజేశారు. కొన్ని గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులను కూడా వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజ్ మాట్లాడుతూ ఉపాధిహామీ పనులు గైడ్‌లైన్స్ ప్రకారం నిర్వహించాలన్నారు. అవకతలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీఓ నాగేందర్, ప్లాంటేషన్ మేనేజర్ మానిక్ కుమార్, అబుడ్స్‌మెన్ బోజిరెడ్డి, ఎంపీఓ మహేష్, ఏపీఓ అశోక్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



సోషల్ ఆడిట్ వివరాలను తెలుపుతున్న సభ్యులు

ట్రాస్‌కార్ప్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీపై కేసు

పటాన్‌చెరు టౌన్: హయత్‌నగర్‌కు చెందిన ట్రాస్‌కార్ప్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీపై కేసు నమోదైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన రహీమ్‌ఖాన్, రిజ్వాన బేగం కూతురు సన ఫర్విన్ చైనాలోని కికి హర్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువుతున్నది. అయితే హయత్‌నగర్‌కు చెందిన ట్రాస్‌కార్ప్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ద్వారా నగదును కూతురికి పంపేవారు. ఈ క్రమంలో కాలేజీ ఫీజు చెల్లించేందుకు గతేడాది అక్టోబర్ 25న రూ.2లక్షలు జమ చేశారు. అయితే కంపెనీ వారు కాలేజీ ఫీజు చెల్లించలేదు. దీంతో ఆ నగదు అడిగితే తిరిగి ఇవ్వకపోవడంతో రిజ్వానాబేగం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీ సేవలు

- డీజీఎం సర్వేశ్వర్‌రావు

నారాయణఖేడ్: వాణిజ్య బ్యాంకులకు ధీటుగా డీసీసీ బ్యాంకుల ద్వారా సేవలు అందిస్తున్నట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) డీజీఎం సర్వేశ్వర్‌రావు అన్నారు. ఇంటింటికీ డీసీసీబీ సేవలు కార్యక్రమంలో భాగంగా ఖేడ్‌లోని డీసీసీ బ్యాంకులో ఖాతాదారులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సర్వేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని 49 బ్యాంకు శాఖల ద్వారా ఇప్పటివరకు రూ.440 కోట్ల రుణాలను అందించామన్నారు. డీసీసీబీ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకట్ రాములు, స్థానిక బ్రాంచి మేనేజరు వెంకటేశ్, టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, ఐకేపీ ఏపీఎంలు టిక్యానాయక్, వంశీకృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డిపాజిట్ చేసిన వారికి ఉచిత బీమా సౌకర్యం

పటాన్‌చెరు: డీసీసీబీ బ్యాంకులో ఖాతా ఓపెన్ చేసి డిపాజిట్ చేసిన ఖాతాదారులకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ అశ్వినిరెడ్డి అన్నారు. పటాన్‌చెరులోని డీసీసీబీ(జిల్లా సహకార కేంద్రం బ్యాంక్)లో ఇంటింటికి డీసీసీబీ కార్యక్రమంలో భాగంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బ్యాంక్ డైరెక్టర్ రాఘువేందర్‌రెడ్డి, ఏజీఎం కృష్ణలత మాట్లాడుతూ.. సహకార బచ్పన్ డిపాజిట్‌కు అత్యధిక 8శాతం, సీనియర్ సిటిజెన్స్ 8.25 ఫిక్స్ డ్ డిపాజిట్ మీద అత్యధిక వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

డీసీసీబీ సేవలతో ప్రయోజనం

సంగారెడ్డి: డీసీసీ బ్యాంక్ సేవలతో ఖాతాదారులకు ప్రయోజనం చేకూరుతుందని డీసీసీ బ్యాంక్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. ఇంటింటికి డీసీసీబీ కార్యక్రమంలో భాగంగా శనివారం కేంద్ర కార్యాలయంలో డిపాజిట్ల మోహోత్సవం కరపత్రాన్ని ఆవిష్కరించారు. సీఈఓ శ్రీనివాస్, సిబ్బంది పంతులు, అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లా సహకార సంఘం బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుధాకర్, బ్రాంచి మేనేజరు రాజు అన్నారు. ఝరాసంగం డీసీసీబీలో ఇంటింటికి డీసీసీబీ కార్యక్రమంలో భాగంగా శనివారం సహకార బచ్‌పాన్ భరోసా డిపాజిట్ స్కీమ్ పథకం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఝరాసంగం సొసైటీ చైర్మన్ గౌసోద్దీన్, ఏపీఎం బాలకృష్ణ, సీసీలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీ ద్వారా ఉత్తమ సేవలు

కల్హేర్(నారాయణఖేడ్): డీసీసీబీ ద్వారా రైతులకు ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు ఆ బ్యాంక్ డైరెక్టర్ గుండు వెంకట్‌రాంలు అన్నారు. ఇంటింటా డీసీసీబీ కార్యక్రమంలో భాగంగా వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెనేజర్ రవీందర్, ఫీల్డ్‌ఫిసర్ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, ఎంపీటీసీ పీరప్ప పాల్గొన్నారు.



నారాయణఖేడ్: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ అధికారులు

బచ్‌పన్ భరోసాతో చిన్నారులకు మేలు

హత్నూర(సంగారెడ్డి): బచ్‌పన్ భరోసాతో చిన్నారులకు మేలు చేకూరుతుందని డీసీసీబీ దౌల్తాబాద్ బ్రాంచ్ మేనేజర్ ప్రవళిక అన్నారు. మండల పరిధిలోని దౌల్తాబాద్ డీసీసీబీ బ్రాంచ్ బచ్‌పన్ భరోసా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాసాల పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ వినయ్, ఫీల్డ్ ఆఫీసర్ యాకూబ్ పాషా, హత్నూర కసాల సీఈవోలు శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి సహకార సంఘాలకు ఎన్నికలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని పలు సహకార సంఘాలకు ఈనెల 6 నుంచి 28 వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార సంఘాల అధికారి కరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మత్స్య సహకార సంఘాల (68), గొర్రెల సహకార సంఘం (1), కల్లుగీత కార్మికుల సహకార సంఘం(1)కి ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

గోమాతకు పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): టీటీడీ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో శనివారం గోమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఎర్ర చందనం పూసి, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్, రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శనివారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో కార్పొరేటర్ పుష్ప నగేష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంగారెడ్డి టౌన్‌లో...

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలో ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాలను ముస్తాబు చేశారు.

ఆంజనేయస్వామికి ఎమ్మెల్యే పూజలు

పటాన్‌చెరు టౌన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని శాంతినగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, జేపీ కాలనీ శ్రీపంచముఖి హనుమాన్ దేవాలయాల్లో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, పంచముఖ ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు విరుపాక్ష, మల్లం పవన్ పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ జీలుగ విత్తనాలు పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల పరిధిలోని బోక్కస్‌గాం పీఏసీఎస్‌లో శనివారం జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ శశాంక్ మాట్లాడుతూ రైతులు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పొందుటకు పట్టా పాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ భార్గవ్, సీఈఓ సతీష్, బీటీఎం మారుతిరెడ్డి పాల్గొన్నారు.

◆ హాస్టల్‌లో ప్రవేశానికి అవకాశం

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని కంకోల్ ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌లో 3, 8వ తరగతులకు ప్రవేశం ఉందని వార్డన్ దుర్గేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హాస్టల్‌లో చేరే విద్యార్థులు 3వ తరగతి బోనాఫైడ్, కులం, నివాసం, ఆదాయ ధ్రువీకరణ ప్రతాలతో పాటు ఆధార్‌కార్డు, రెండు పాస్ పోటోలతో ఈ నెల 15వ తేదీ లోపు కంకోల్ హాస్టల్‌కు తీసుకొని రావాలని సూచించారు.

◆ బాధ్యులపై చర్యలకు డిమాండ్

నారాయణఖేడ్: గత నెల 13న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో విధులు నిర్వర్తించిన సిబ్బందికి రెమ్యునరేషన్ తక్కువగా ఇచ్చారని అడిగిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన సహాయ రిటర్నింగ్ అధికారి అశోకచక్రవర్తి, ఖేడ్ సీఐ శ్రీనివాస్డ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు కాశీనాథ్ జాదవ్, కార్యదర్శులు నరేష్, యశప్ప, నర్సయ్య శనివారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. మే 15న తమ సంఘ రాష్ట్ర కమిటీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేయగా అధికారులపై చర్యకు సమగ్ర నివేదిక కోరుతూ మే 18న ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన కలెక్టరుకు లేఖ పంపిందని గుర్తు చేశారు. లేఖ పంపి 12 రోజులు గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ కేవీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్: రైతులు కేవీకే అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త అరవింద్ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవ వేడుకలు మండల పరిధిలోని దిడిగి శివారులో ఉన్న కేవీకేలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ కేవీకే గత సంవత్సరంలో 2518 భూసార పరీక్షలను నిర్వహించి ఫలితాలను రైతులకు అందించిందన్నారు. రైతులు పాడి పరిశ్రమ పట్ల ఆసక్తి చూపాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ, కేవీకే శాస్త్రవేత్తలు వరప్రసాద్, కై లాష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

◆ జోడేడ్ల అపహరణ

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని చిన్న చల్మెడ గ్రామంలో జోడేడ్లు అపహరణకు గురయ్యాయి. బుదేరా ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గడ్డమీద శ్రీశైలం శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే తన ఇంటి ముందు జోడేడ్లను కట్టేశాడు. దీంతో గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు వాటిని అపహరించుకుపోయారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న తనను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు శ్రీశైలం వేడుకున్నాడు. ఎడ్లు ఎక్కడైన కనిపిస్తే 8712661835 బుదేరా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

◆ అదుపుతప్పిన ట్రాక్టర్

జహీరాబాద్: ఎరువులను తీసుకుని వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు కిందకు వెళ్లడంతో పలువురు గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంగం మండలం గినియార్‌పల్లి నుంచి మొగుడంపల్లి మండలంలోని గౌటిగార్‌పల్లికి వెళ్తున్న క్రమంలో బూచనెల్లి గ్రామం వద్ద అదుపు తప్పి రోడ్డు కిందకు వెళ్లింది. దీంతో డ్రైవర్‌తో మల్లప్పతో పాటు ట్రాక్టర్‌పై ఉన్న రవి, చర్లగోపాల్, మల్లప్పలకు తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

◆ డ్రైనేజీ వ్యర్థాలను తొలగించాలి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో డ్రైనేజీ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని జీహెచ్ఎంసీ సిబ్బందికి కార్పొరేటర్ కుమార్‌యాదవ్ సూచించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ, శాంతినగర్, గొల్లబస్తీ, ఎంజీ రోడ్, పాత మార్కెట్ రోడ్డు, కటికబస్తి కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. ఆయన వెంట కాలనీవాసులు, నాయకులు ఉన్నారు.

◆ ఉత్సవాలకు తరలిన బీఆర్ఎస్ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపుమేరకు శనివారం సదాశివపేట పట్టణ మండల పరిధి నుంచి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చింతా సాయికుమార్, సోమశేఖర్, నరేష్‌గౌడ్, నాగేష, చోటు, ఆరీఫ్, నవీన్ పాల్గొన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఝరాసంగం(జహీరాబాద్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణ పరిధిలోని భాగారెడ్డిపల్లికి చెందిన రాములు (48) మేస్త్రి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నెల 27న మండల పరిధిలోని కప్పాడ్ గ్రామానికి పనితో పాటు శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా కుప్పానగర్ గ్రామ శివారుకు రాగానే అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో గమనించిన స్థానికులు జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.